
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 32.5
కనిష్ఠం 24.8
**
ANDHRAJYOTHY



సూర్యాపేట
5
గురువారం 19 సెప్టెంబరు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.90 (311.7462)	68,004	70,926
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.89 (4.17)	359.89	628.28
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.21 (44.53)	51,042	51,042

చికెన్ ధరలు లైవ్ : రూ.110 డ్రెస్ : రూ.160 స్కిన్‌లెస్ : రూ.190

చేనేతకు ఊరట

» ఉమ్మడి జిల్లాకు రూ.27.27కోట్ల త్రిఫ్ట్ నిధులు మంజూరు

» సుమారు 16వేల మంది కార్మికులకు లబ్ధి » ఖాతాల్లో జమ అవుతున్న నగదు



భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 18: చేనేత సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించి పరిష్కారానికి సిద్ధమైంది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా బకాయి ఉన్న త్రిఫ్ట్ పథకం నిధులు రూ.90కోట్లు మంజూరు చేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రూ.27.27కోట్ల మేరకు నిధులు విడుదలయ్యాయి. అంతేగాక చేనేత సహకార సంఘాలకు గత ప్రభుత్వంలో టెస్కో బకాయిపడ్డ రూ.30 కోట్లు కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో చేనేత వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

త్రిఫ్ట్ పథకానికి మూడేళ్లకు సంబంధించి వాటాధనం కలిపి మొత్తం రూ.27.27కోట్లు ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వం కేటాయించింది. దీంతో సుమారు 16వేల మంది కార్మికులకు లబ్ధి చేకూరనుంది. అందులో యాదాద్రి జిల్లాలో రూ.17.77కోట్ల మేరకు నిధులు కార్మికుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. సుమారు 11,380 మందికి లబ్ధి చేకూరనుంది. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు సంబంధించి త్రిఫ్ట్ బకాయిలు రూ.9.50కోట్లు మంజూరయ్యాయి. దీంతో సుమారు 4,500 మంది కార్మికులకు లబ్ధి చేకూరనుంది. నేతన్నకు చేయూత (త్రిఫ్ట్) పథకాన్ని గత ప్రభుత్వం మూడేళ్ల కాలపరిమితితో 2017 జూన్ 24న ప్రారంభించింది. చేనేత కుటుంబాల నుంచి సానుభూతి వ్యక్తమవుతుండటంతో ఈ పథకాన్ని మరింతకాలం పొడిగించింది. ఈ ఏడాది ఆగస్టు 31 వరకు కాలపరిమితి ముగిసింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో నిధుల విడుదలలో జాప్యం జరిగింది. ఎట్టకేలకు 11 నెలల తర్వాత ప్రభుత్వం తన వాటాధనం ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రూ.27.20కోట్లు విడుదల చేసింది.

త్రిఫ్ట్ పథకం ఇలా..

త్రిఫ్ట్ పథకంలో మగ్గం నేసే కార్మికుడు, అనుబంధంగా మరో ఇద్దరికి లబ్ధి చేకూరనుంది. నేతన్నకు చేయూత పథకంలో యాదాద్రి 11,839 మంది కార్మికులు ఉండగా అందులో సహాయకులుగా 5,045 మంది ఉన్నారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో మొత్తం 4,500 మంది వరకు ఉన్నారు. వీరందరూ బ్యాంకుల్లో ఖాతా-1 తెరవగా, చేనేత, జౌళీశాఖ అధికారి పేరుతో జాయింట్ ఖాతా-2 ఆర్‌డీ (రికరింగ్ డిపాజిట్)ను ప్రభుత్వం తెరిపించింది. మగ్గం నేసే కార్మికుడు, అతడికి అనుబంధంగా ఇద్దరు చొప్పున సేవింగ్స్ ఖాతాలో జమచేసిన మొత్తానికి ప్రభుత్వం రెండింతలు వాటాధనం జమ చేస్తుంది. మగ్గం నేసే కార్మికుడు ప్రతి నెలా రూ.1,200, అనుబంధ కార్మికులు ఒకరు రూ.800, మరొకరు రూ.600 చొప్పున సేవింగ్స్ ఖాతాలో జమ చేస్తారు. వీరి ఆర్డీ ఖాతా-2లో రాష్ట్ర ప్రభుత్వం రెండింతల మొత్తాన్ని జమ చేసింది. ఆ మొత్తాన్ని కలిపి ప్రస్తుతం చేనేత కుటుంబాల ఖాతాల్లో అధికారులు జమ చేస్తున్నారు.

● రెండు, మూడు రోజుల్లోనే అందరి ఖాతాల్లో నగదు జమ చేస్తాం



నేతన్నకు చేయూత (త్రిఫ్ట్) పథకం కాలపరిమితి ఆగస్టు 31 నాటికి ముగిసింది. జిల్లాలోని 11,389 మంది కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.17.77కోట్ల బకాయి ఉండగా, వాటిని విడుదల చేసింది. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తాం. రెండు మూడు రోజుల్లో అందరి ఖాతాల్లో నగదు జమ అవుతుంది. అయితే ఈ పథకం పొడిగింపుపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. కొత్తగా చేనేత అభయహస్తం పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకానికి సంబంధించిన విధి విధానాలు రావాల్సి ఉంది.

మహమూద్ కామిల్, చేనేత, జౌళీశాఖ ఏడీ, యాదాద్రి


● త్రిఫ్ట్ పథకాన్ని పునరుద్ధరించాలి



మగ్గం నేసే చేనేత కార్మికుల కుటుంబాలకు, వారి సహాయకులకు త్రిఫ్ట్ స్కీం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. ఆర్థికంగా కూడా చాలా ప్రయోజనం కలిగింది. కార్మిక కుటుంబాల సంక్షేమం దృష్ట్యా ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించాలి. అంతేగాక చేనేత కార్మికుల కుటుంబాలకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలి. ఇల్లులేని నిరుపేద చేనేత కార్మికుల కుటుంబాలకు ఇల్లు కట్టించి ఆదుకోవాలి. గత ప్రభుత్వం చేనేత కార్మికులకు అమలు చేసిన అన్ని పథకాలను కొనసాగించాలి.

కూరపాటి భాస్కర్, పోచంపల్లి చేనేత కార్మిక సంఘం నాయకుడు

అక్టోబరుపై అందరి ఆశలు



» ఇందిరమ్మ ఇళ్ల కోసం పేదల ఎదురుచూపు

» మంజూరుకు సన్నాహాలు చేస్తున్న ప్రభుత్వం

» ఒక్కో నియోజకవర్గానికి 3,500ఇళ్లు

» ఎమ్మెల్యేలకు సవాల్‌గా మారనున్న లబ్ధిదారుల ఎంపిక

యాదాద్రి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అక్టోబరులో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పథకాన్ని ప్రారంభించేందుకు నిర్ణయించినట్టు సమాచారం. అదేవిధంగా కొత్త రేషన్ కార్డులు సైతం ఇదే నెలలో మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండటంతో అందరి ఆశలు అక్టోబరుపైనే ఉన్నాయి.

ఇప్పటికే 'ప్రజాపాలన' కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం పేదలు దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే రాష్ట్రంలోని పేద, బడుగు వర్గాలకు సొంతింటిని నిర్మించి ఇస్తామని, తెలంగాణ ఉద్యమకారులకు 250చదరపు గజాల స్థలాన్ని, ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. అయితే ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావొస్తుండగా, ఇందిరమ్మ పథకం కింద ఇళ్లను మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నారు. అక్టోబరు నెలలో ఈ పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. 45రోజుల్లోగా ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోస్తామని జూలై 30న రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భువనగిరిలో ప్రకటించారు. ప్రతీ నియోజకవర్గానికి కనీసం 3,500 ఇళ్లను నిర్మించి పేదలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీంతో మొదటి దశలో ఇందిరమ్మ ఇళ్లను దక్కించుకోవాలని కొందరు ఆ మేరకు ఎమ్మెల్యేలకు దరఖాస్తు కూడా చేసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వెలువడగానే మంజూరు చేస్తామని, అప్పటివరకు వేచి ఉండాలని ఎమ్మెల్యేలు హామీ ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలు పూర్తిస్థాయిలో ఉండగా, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాలు పాక్షికంగా ఉన్నాయి. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో 7వేల ఇళ్లవరకు మంజూరు కానున్నాయి.

సవాల్‌గా మారనున్న లబ్ధిదారుల ఎంపిక

ఇందిరమ్మ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ఎమ్మెల్యేలకు సవాల్‌గా మారనుంది. దరఖాస్తులు అధికం, మంజూరు తక్కువ స్థాయిలో ఉండటంతో లబ్ధిదారుల ఎంపిక కత్తిమీది సాములా ఉండనుంది. ఒక్కో నియోజకవర్గంలో నాలుగు నుంచి ఎనిమిది వరకు మండలాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మండలానికి ఎన్ని ఇళ్లను కేటాయించాలనే అంశంపై ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. యాదాద్రి జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇప్పటికే 45వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. నల్లగొండ జిల్లాలో సుమారు 66వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు కానుండటంతో లబ్ధిదారుల ఎంపికపై ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలతో కసరత్తు చేస్తున్నారు. కొంతమంది మంజూరు చేసి, మరికొంత మందికి ఇవ్వని పక్షంలో గ్రామాల్లో వ్యతిరేకత వస్తుందన్న భయం కూడా వారిలో ఉంది.

గతంలో ఇలా..

బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకాన్ని అమలు చేసింది. యాదాద్రి జిల్లాకు 3,464 ఇళ్లను మంజూరు చేయగా, 1,158 ఇళ్లు మాత్రమే నిర్మించారు. పలు ఇళ్లు టెండర్ల దశలో నిలిచాయి. ఈ పథకం విజయవంతం కాకపోవడంతో, సొంత స్థలం ఉండి, ఇంటి నిర్మాణానికి ఆర్థిక స్థోమతలేని పేదలకు గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో గత ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ పథకానికి సంబంధించి ఉత్తర్వులతో పాటు మార్గదర్శకాలు విడుదల చేసింది. ఒక్కో నియోజకవర్గానికి 3వేల ఇళ్ల చొప్పున కేటాయించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగానే నివాస స్థలం ఉన్న వారికి ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందించనుంది. అయితే జిల్లాలో మొత్తం 34,417 దరఖాస్తులు వచ్చాయి. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి కాలేదు. గృహలక్ష్మి పథకానికి జిల్లాకు మొత్తం 8,400 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో భువనగిరి నియోజకవర్గానికి 3,000, ఆలేరుకు 3,000 ఇళ్లు, మునుగోడుకు 1,100 ఇళ్లు, తుంగతుర్తికి 900 ఇళ్లు, నకిరేకల్‌కు 400 ఇళ్ల చొప్పున మంజూరయ్యాయి.

గృహలక్ష్మి లబ్ధిదారుల్లో 20శాతం ఎస్సీలు, 10శాతం ఎస్టీలు, 50శాతం, బీసీలు, మైనార్టీలు, 5శాతం దివ్యాంగులకు కేటాయించారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం పేదలకు రూ.3లక్షల ఉచితంగా ఇవ్వాలని ఉత్తర్వులు జారీచేసింది. లబ్ధిదారులు వారి ఇంటిని సొంత డిజైన్ ప్రకారం రెండు గదులతో ఆర్‌సీసీ భవనంతో పాటు మరుగుదొడ్లు కూడా నిర్మించుకోవాలి. అయితే ఎన్నికల ముందు ఈ పథకాన్ని గత ప్రభుత్వం హడావుడిగా ప్రారంభించగా, ఇళ్ల మంజూరు స్థాయిలోనే నిలిచింది. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకానికి ఇందిరమ్మ ఇళ్లు అని పేరుమార్చి అమలు చేయనుంది. త్వరలోనే ఈ పథకం కింద ఇళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

కొత్త రేషన్ కార్డులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

సూర్యాపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కొత్తరేషన్ కార్డుల కోసం అక్టోబరు నుంచి దరఖాస్తులు తీసుకుంటామని ఇటీవల మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. జిల్లాలో సైతం ఇప్పటికే చాలా మంది తెల్లరేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇటుక బట్టీలు, సెంట్రింగ్ పనులు, ఇతర పనులు చేస్తున్నారు. ఎక్కువగా ఒడిశా, చత్తీస్‌ఘడ్, బీహార్ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరిలో చాలా మందికి రేషన్‌కార్డులు లేవు. ఇప్పటికే కొంత మంది దరఖాస్తు చేసుకున్నారు. అంతేగాక కొత్తగా పెళ్లయి వేరే కాపురం ఏర్పాటు చేసుకున్నవారు ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ప్రభుత్వ ప్రకటనతో వారికి ఊరట లభించనుంది.

అన్ని ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డు కీలకంగా మారింది. గత ప్రభుత్వం రేషన్ కార్డుకు ఆదాయ పరిమితి నిబంధన విధించింది. గ్రామీణ ప్రాంతాల్లో వార్షికాదాయం రూ.1.5లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల లోపు ఉన్న కుటుంబాలకే రేషన్ కార్డులు మంజూరు చేశారు. అంతేకాక 3.5 ఎకరాల్లోపు, 7.5 ఎకరాల్లోపు మెట్ట భూమి ఉంటే కార్డు మంజూరు చేశారు. వీటన్నింటినీ సవరించి నూతన విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయనుంది. బియ్యం అవసరం లేని వారికి కొత్త స్మార్ట్ హెల్త్ కార్డు కూడా అందించనుంది.

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో కొత్తరేషన్‌కార్డులను జారీ చేసింది. ఆ తరువాత 2017 జూన్ నుంచి ఆహార భద్రత కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేసింది. దీంతో నిరుపేదలు రేషన్ సరుకుల కోసం అవస్థలు ఎదుర్కొన్నారు. 2021లో గతంలో దరఖాస్తు చేసుకున్న కొందరికి నూతన కార్డులు ఇచ్చారు. 2017 తర్వాత జన్మించిన పిల్లల పేర్లు రేషన్ కార్డులో నమోదు కాలేదు. దీంతో నిరుపేదలు ప్రభుత్వ నుంచి వచ్చే రేషన్, సరుకులు అందలేకపోయారు. ఉచిత బియ్యం నిరుపేదలకు ఆసరాగా ఉండేది. అయితే కార్డులో నూతనంగా పేరు నమోదు కాకపోవడంతో ఉచిత బియ్యం ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులందరికీ అందలేదు. వచ్చే ఏడాది జనవరి నుంచి రేషన్‌కార్డు ఉన్న వారికి సన్న బియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దొడ్డు రకం బియ్యం అందజేయడం వల్ల అవి బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నాయి. సన్నబియ్యం పంపిణీ చేస్తే లబ్ధిదారులు వినియోగిస్తారని ప్రభుత్వ ఆలోచన.

ఏళ్లుగా దరఖాస్తులు పెండింగ్‌లో

సూర్యాపేట జిల్లాలో 609 రేషన్ దుకాణాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 3,15,180 రేషన్ కార్డులు ఉన్నాయి. అందులో 2,96,359 ఆహార భద్రత కార్డులు, 18,773 అంత్యోదయ కార్డులు, 48 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. ఈ కార్డులకు ప్రభుత్వం నెలకు 59,52,779 కిలోల బియ్యాన్ని సరఫరా చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా పేరు మార్పిడి, వివిధ కారణాలతో 25,815 మంది దరఖాస్తు చేసుకున్నారు. కేవలం నూతన కార్డుల కోసం 14,367 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. చివరగా మూడు సంవత్సరాల క్రితం 8,753 కార్డులను పంపిణీ చేశారు. నల్లగొండ జిల్లాలో నూతన రేషన్ కార్డుల కోసం సుమారు 16వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే ప్రజాపాలనలో పలు చోట్ల రేషన్ కార్డుల కోసం పేదలు దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులకు ప్రభుత్వం అక్టోబరు నెలలో మోక్షం కల్పించే అవకాశం ఉంది. అదేవిధంగా ఉచిత వైద్య చికిత్సల కోసం ప్రభుత్వం స్మార్ట్ హెల్త్ కార్డులు మంజూరు చేయనుంది.

విద్యుదాఘాతంతో

వివాహిత సజీవదహనం



నాగారం, సెప్టెంబరు 18: జీవితాంతం తోడుంటానని.. ఎంత కష్టమొచ్చినా వెన్నంటే ఉంటానని ఆ భర్త ఇచ్చిన మాటపై విధి కన్నెర్ర చేసింది. పెరాలసిస్(పక్షవాతం)తో బాధపడుతున్న భార్యకు నేనున్నానంటూ సపర్యలు చేస్తున్న భర్తను చూసి తట్టుకోలేకపోయింది. విధి ఆడిన వింత నాటకంలో.. అగ్ని ప్రమాదం రూపంలో ఆ భార్యను అగ్ని ఆవహించింది. అప్పటిదాకా అక్కడే ఉండి, భార్యకు ఆకలి అవుతుంది.. వంట చేసేందుకు కిరాణ దుకాణానికి సామగ్రి కోసం వెళ్లిన భర్త ఇంటికి వచ్చేసరికి, కాలి బూడిదవుతున్న తన భార్యను చూసి గుండెలవిసేలా రోదించాడు. బుధవారం రాత్రి సూర్యాపేట జిల్లా నాగారం మండలంలో ఈ విషాదం నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నాగారం మండలం ఈటూరు గ్రామానికి చెందిన మహంకాళి వెంకటమ్మ(55) రెండేళ్లుగా పక్షవాతంతో బాధపడుతోంది. గ్రామంలో తమకున్న రేకుల షెడ్డులో భర్తతో రాములుతో కలిసి ఉంటోంది. వెంకటమ్మకు రెండు కాళ్లు పెరాలసిస్‌తో పడిపోవడంతో భర్తే సపర్యలు చేస్తున్నాడు. కుటుంబ పోషణకోసం ఉదయం కూలీ పనులకు వెళ్లి సాయంత్రం పొద్దుపోయాక వచ్చేవాడు. ఈ సమయంలో ఆమెకు ఏమైనా అవసరముంటే చుట్టుపక్కల ఇళ్లవారికి చెప్పి వెళ్లేవాడు. ఇలా కాలం గడుస్తుండగానే అనుకోని ప్రమాదం ఆ జంటను విడదీసింది. కంటికి రెప్పలా కాపాడుకున్న భర్త లేనిది చూసి ప్రమాదం ఆవహించింది. బుధవారం రాత్రి ఏడు గంటల సమయంలో వంట చేసేందుకు రాములు కురగాయలు తేవడానికి ఇంటికి సమీపంలోని కిరాణ దుకాణానికి వెళ్లాడు. వెంకటమ్మ ఇంట్లో నిద్రిస్తుండగా విద్యుదాఘాతం జరిగి మంటలు అంటుకున్నాయి. ఆమె నిద్రిస్తున్న మంచానికి, ఆపై ఆమెను మంటలు దహించివేశాయి. పెరాలసిస్‌తో కదల్లేని స్థితిలో ఉన్న వెంకటమ్మ ఇంట్లో నుంచి బయటకు రాలేకపోయింది. మంచంపై ఉన్న దుప్పట్లు, ఇంట్లో ఉన్న సామగ్రికి మంటలు అంటుకోవడంతో ఊపిరాడక మంటల్లోనే సజీవ దహనమైంది. ఇంట్లో నుంచి మంటలు వస్తుండడంతో చుట్టుపక్కల వారు గమనించి మంటలను ఆర్పారు. అప్పటికే వెంకటమ్మకు మంటలు వ్యాపించి దహనమైంది. వెంకటమ్మకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వారందరికీ వివాహం కావడంతో వేరుగా ఉంటున్నారు. పెరాలసిస్‌తో బాధపడుతున్న భార్య వెంకటమ్మకు వంట చేసి పెడదామని, కిరాణ దుకాణానికి వెళ్లి వచ్చేలోగా మంటల్లో కాలిపోవడంతో భర్త రాములు రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. ఘటనా స్థలానికి నాగారం సీఐ రఘువీరారెడ్డి, ఎస్ఐ ఐలయ్యలు చేరుకుని విద్యుత్ ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. మంటల్లో కాలిపోయిన వెంకటమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భర్త రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విద్యుత్ ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలపాలి

● కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 18: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 21వ తేదీలోగా సంబంధిత గ్రామ కార్యదర్శులకు దరఖాస్తులు చేయాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముసాయిదా ఓటరు జాబితాలను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రదర్శించామన్నారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే వాటిని ఈనెల 26వ తేదీలోగా పరిశీలించి 28న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామన్నారు. జిల్లాలో ఇంటింటి సర్వే నిర్వహించి ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే సరి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 10,02,282 ఓట్లకు 9,14,259 మంది ఓట్లను పరిశీలించామన్నారు. 2,001 మంది వివిధ ప్రాంతాలకు వారి ఓటును మార్చుకునేందుకు దరఖాస్తులు చేశారన్నారు. అదే విధంగా 4,608 మంది ఓటర్లు మృతి చెందినట్లు గుర్తించామన్నారు. వీటితో పాటు 1,539 మంది ఓటర్ల ఫొటోలు సరిగా లేవని, 827 మంది ఓట్లు రెండు చోట్ల ఉన్నాయని గుర్తించినట్లు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో జడ్పీ సీఈవో అప్పారావు, డీపీవో నారాయణరెడ్డి, ఎన్నికల పర్యవేక్షణాధికారి శ్రీనివాసరావు, పద్మారావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు చకిలం రాజేశ్వర్‌రావు, ఎండి.అబీద్, సవరాల సత్యనారాయణ, మందారి డేవిడ్‌కుమార్, స్టాలిన్, గోపి, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

ఉండ్రుగొండ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

జిల్లాలో ఎంతో చరిత్ర కలిగిన ఉండ్రుగొండ అభివృద్ధికి అందరి సహకారంతో ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో ఉండ్రుగొండ లక్ష్మీనర్సింహస్వామి దేవస్థాన కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఏడాది అక్టోబరు 27న నిర్వహించే పర్యాటక దినోత్సవం ఈ సారి ఉండ్రుగొండ దేవాలయం వద్ద నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఉండ్రుగొండ ప్రాంతాన్ని ఆహ్లాదకరంగా, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉండ్రుగొండ గిరిదుర్గ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఎ.రామయ్య, కార్యదర్శి మహేశ్వరం రవిచంద్ర, డాక్టర్ వూర రాంమూర్తియాదవ్, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, కృష్ణమోహన్, చకిలం కృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అందిస్తున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో టీపీయూఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, టీపీయూఎస్ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతం సంధ్యారాణి, యామా రమేష్, విద్యాశాఖ కోఆర్డినేటర్ ఎర్రంశెట్టి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 18: మండల పరిధిలోని గట్టికల్ గ్రామంలో ఎస్సీ కాలనీకి రెండురోజులుగా తాగునీరు అందకపోవడంతో బుధవారం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలోకి రావాల్సిన తాగునీటి పైపులైన్ లీకేజీ, తరుచూ బోరు మోటార్ మరమ్మతుకు గురవుతోంది. దీంతో కార్యదర్శి మరమ్మతు చేయించినా విద్యుత్ ఓవర్‌లోడ్ కారణంగా మోటారు నడవడం లేదు. దీంతో కొద్ది రోజుల నుంచి సక్రమంగా నీరందడంలేదని మహిళలు ఆవేదనవ్యక్తం చేశారు. పంచాయతీ మోటార్‌కు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. సమాచారం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ విద్యుత్ ఏఈతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలపడంతో మహిళలు నిరసన విరమించారు. కార్యక్రమంలో గ్రామస్థులు మడ్డి పుష్పలత, రంగు భాగ్యమ్మ, జానకమ్మ, పద్మ, సుజాత, రాజ్యమ్మ, శ్రీను, అంజయ్య, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయాలి

ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



సూర్యాపేటక్రైం, సెప్టెంబరు 18: వేధింపులకు గురవుతున్న మహిళలు, విద్యార్థినులు నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, రద్దీ ప్రాంతాలు, కళాశాలలు, బస్టాండ్ల వద్ద షీటీంలు సంచరిస్తూ వేధింపులకు పాల్పడుతున్న ఆకతాయిలను పట్టుకొని కౌన్సిలింగ్ ఇవ్వడంతోపాటు కేసులు నమోదు చేస్తున్నాయన్నారు. మహిళలు, విద్యార్థుల రక్షణలో షీటీంలు పటిష్ఠంగా పనిచేస్తున్నాయన్నారు. కోదాడ డివిజన్ పరిధిలో హాట్‌స్పాట్లు గుర్తించి రక్షణ చర్యలు చేపట్టామన్నారు. డివిజన్ పరిధిలో గత 15 రోజులుగా 23మందికి కౌన్సిలింగ్‌లు, 15 అవగాహన కార్యక్రమాలు, 25 కేసులు నమోదు చేశామన్నారు. వేధింపులపై హెల్ప్‌లైన్ నెంబర్ 8712686056కు ఫిర్యాదు చేయాలన్నారు.

ఎంబీ కెనాల్‌కు నీటి విడుదల



నీటిని విడుదలచేస్తున్న నీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు శ్రీనివాసు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 18 : సాగర్ ఎడమ కాల్వ మొదటిజోన్ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు నీటి సంఘాల సమాఖ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గూడెపు శ్రీనివాసు, టీపీసీసీ అధికార ప్రతినిధి దొంగరి వెంకటేశ్వర్లు రైతులతో కలిసి బుధవారం నీటిని విడుదల చేశారు. ఎడమ కాల్వ పరిధిలోని మొదటిజోన్‌లో ఉన్న ఎంబీ కెనాల్‌కు మునగాల హెడ్ రెగ్యులేటరీ వద్ద నీటిని విడుదల చేశారు. ఆగస్టు 31న భారీ వర్షాలతో ఎంబీకెనాల్ 14వ కిలోమీటర్ వద్ద గండి పడింది. కాగా, మంత్రి ఆదేశాల మేరకు అధికారులు ఈ గండిని పూడ్చారు. బుధవారం సాయంత్రం నుంచి 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎంబీ కెనాల్ సామర్థ్యం 1,800 క్యూసెక్కులు కాగా, మొదటిరోజు 800 క్యూసెక్కులు విడుదల చేయగా, క్రమక్రమంగా నీటి సామర్థ్యాన్ని పెంచుతామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ఎంబీ.కెనాల్ కింద 1.07లక్షల ఎకరాల సాగుభూమి స్థిరీకరించి ఉంది. వీటికి ఇక్కడి నుంచే సాగునీరు అందనుంది. కార్యక్రమంలో ఎడమ కాల్వ పరిరక్షణ సభ్యుడు కుందూరు శ్రీనివాస్‌రెడ్డి, రైతులు వీరనాగిరెడ్డి, అరుణ్‌కుమార్‌దేశ్‌ముఖ్, దొంగరి సత్యనారాయణ, చక్కెర వీరారెడ్డి, కట్టా గోపాల్‌రావు, నర్సింహారావు పాల్గొన్నారు.

ఉద్యోగి కుటుంబానికి చేయూత

● మంత్రి కోమటిరెడ్డి ద్వారా రూ. 5లక్షల చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న మంత్రి

నల్లగొండ, సెప్టెంబరు 18: ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్‌కుమార్ అకాల మరణంతో తోటి ఉద్యోగులంతా అండగా నిలిచారు. గత రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన సంజీవ్ కుమార్ కుటుంబానికి రాష్ట్రవ్యాప్తంగా తోటి ఉద్యోగులు తమ వేతనం ద్వారా రూ.5లక్షలను సేకరించి ఆ చెక్కును బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ద్వారా సంజీవ్ కుమార్ కుటుంబానికి అందజేశారు. అదే విధంగా సంజీవ్ కుమారునికి ఉద్యోగం గురించి కూడా చర్చించగా, ఈ నెల 21న సెక్రటేరియట్‌లో కలవాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో మాజీ ఉద్యోగ సంఘాల నాయకులు వెంకట్‌రాంరెడ్డి, గోన మోహన్‌రావు, జేఏసీ చైర్మన్ లింగయ్య, కో చైర్మన్ అంజిరెడ్డి, విజయకుమార్, నరసింహాచారి, శ్రీనివాసరావు, జగన్, కృష్ణ, ఉన్నారు.

బాధ్యతగా ఉండాలన్నందుకు ఘాతుకం

● వృద్ధురాలిపై యువకుడి లైంగికదాడి

● మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడికి యత్నం

నల్లగొండ క్రైం/భువనగిరి రూరల్, సెప్టెంబరు 18: మద్యం తాగి ఇంటి సమీపంలో గొడవ చేయవద్దన్నందుకు ఓ యువకుడు వృద్ధురాలిపై దారుణానికి ఒడిగట్టాడు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పాతబస్తీ హిందూపూర్ నీళ్ల ట్యాంకు వద్ద ఉన్న ఓ శ్మశానవాటికలో సభ్య సమాజం తలదించుకునే ఘటన జరిగింది. నల్లగొండ వన్‌టౌన్ పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన వృద్ధురాలు(60) స్వీపర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. పాతబస్తీకి చెందిన కందుల కృష్ణ అలియాస్ కిట్టు కొద్దిరోజులుగా ఆమె ఇంటి సమీపంలో రోజూ మద్యం మత్తులో గలాట చేస్తుండటంతో మందలించింది. కోపం పెంచుకున్న కృష్ణ బుధవారం వృద్ధురాలిని పక్కనే ఉన్న శ్మశానవాటిక వద్దకు లాక్కెళ్లి లైంగిక దాడి జరిపి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావంతో బాధితురాలు ఇంటికి వెళ్లి తన కుమార్తె సహకారంతో నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నల్లగొండ వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడికి యత్నం

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని ఓ గ్రామంలో మానసిక దివ్యాంగురాలిపై ఓ యువకుడు లైంగిక దాడికి యత్నించాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానసిక దివ్యాంగురాలైన మూగ యువతి(20) ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 16వ తేదీ సాయంత్రం తల్లిదండ్రులు పని నిమిత్తం బయటకు వెళ్లారు. ఇంటి పక్కనే నివాసం ఉంటున్న యువకుడు మధు యువతిని తన ఇంట్లోకి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడుతుండగా గమనించిన ఇద్దరు యువకులు ఇంటి తలుపులు తెరవాలని అరిచారు. దీంతో ఆ యువకుడు ఇంటి వెనుకవైపు నుంచి పారిపోయాడు.కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

వలిగొండ, సెప్టెంబరు 18: గుర్తుతెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. బుధవారం రాత్రి ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగింది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. మండలంలోని టేకులసోమారం గ్రామానికి చెందిన సమ్మయ్య (35) నాగిరెడ్డిపల్లి- టేకులసోమారం గ్రామాల పరిధిలో గుర్తు తెలియని రైలుఢీ కొని మృతి చెందాడు. మృతదేహం రైలు పట్టాలపై పడి ఉంది. మృతుడికి మతిస్థిమితం లేదని తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బంగారు గొలుసు అపహరణ

వలిగొండ, సెప్టెంబరు 18: వృద్ధురాలి మెడలోని బంగారు ఆభరణాన్ని గుర్తు తెలియని వ్యక్తి బుధవారంరాత్రి 7గంటలకు అపహరించాడు. ఎస్‌ఐ యుగేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రంలోని సాయినగర్‌కు చెందిన మామిడి అంజమ్మ(85) స్నానం చేసేందుకు బాత్రూంకి వెళ్లింది. ఆ సమయంలో గుర్తు తెలియని యువకుడు బాత్రూంలోకి ప్రవేశించి ఆమె మెడలో ఉన్న గొలుసును అపహరించుకుపోయాడు. రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉజ్జయినిలో మంత్రి ఉత్తమ్ దంపతులు


జ్యోతిర్లింగాన్ని దర్శించుకున్న ఉత్తమ్ దంపతులు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 18: భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పద్మావతి దంపతులు మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహంకాళేశ్వర్ జ్యోతిర్లింగ దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దేవాలయంలో జ్యోతిర్లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించినట్లు తెలిపారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌కు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

నాగార్జునసాగర్, సెప్టెంబరు17: నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ నెల 14న జిల్లాకేంద్రంలో మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి ఎంపికకు వెళ్లిన విద్యార్థులు అండర్-14 విభాగంలో పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథలెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ట్రైయాల్లాన్‌కు సుప్లవ్ రాజ్, లాంగ్ జంప్, షార్ట్ పుట్‌లో అండర్-16 విభాగంలో సుభానూర్ ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఓయూలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం లలిత, పీఈటీ కిరణ్ అభినందించారు.

గతంలో చెప్పిన పరిహారమే ఇవ్వండి

● ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీరు డిమాండ్ చేసిందే అడుగుతున్నాం ● ఆర్‌ఆర్‌ఆర్ రైతులకు న్యాయం చేసే వరకూ పోరాటం ● మాజీ ఎమ్మెల్యేలు ప్రభాకర్‌రెడ్డి, జూలకంటి రంగారెడ్డి



కలెక్టరేట్ ఎదుట ట్రిపుల్ ఆర్ బాధిత రైతులతో కలిసి ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, జూలకంటి రంగారెడ్డి

భువనగిరి అర్బన్, చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 18: 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) బాధితులకు మీరు చెప్పిన నష్టపరిహారమే ఇవ్వండి. అప్పుడు మీరు డిమాండ్ చేసిందే అడుగుతున్నాం' అని మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, జూలకంటి రంగారెడ్డి అన్నారు. రీజనల్ రింగ్‌రోడ్డు నిర్మిస్తే భూములు కోల్పోతున్న రైతులు బుధవారం యాదాద్రిభువనగిరి కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. 2023సంవత్సరం సార్వత్రిక ఎన్నికల ముందు భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.5లక్షల పరిహారం నిబంధనల మేరకు ఇస్తామన్న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాన్ని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అడ్డుకున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.25లక్షలు ప్రతి కుటుంబానికీ నివేశిత స్థలం, కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామన్న హామీలు నిలబెట్టుకోవాలన్నారు. ప్రస్తుత రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరినట్లు ఎకరాకు రూ.50లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రజా అవసరాలకు భూమి సేకరించాలంటే మార్కెట్ ధర చెల్లిస్తామని అన్నదమ్ములు చెప్పారని, ఇళ్లు నిర్మించి కోల్పోయిన భూమికి మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. భూ సేకరణకు తాము అడ్డుకాదని, శాస్త్రీయ పద్ధతిలో సేకరించి 40కిలోమీటర్ల దూరంలో ట్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మించాలనే నిబంధనలు ఉన్నప్పటికీ 28కిలోమీటర్ల లోపే నిర్మిస్తే ఈ ప్రాంత రైతులు తీవ్ర అన్యాయానికి గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. చౌటుప్పల్ రైతుల బాధలు తీర్చేందుకు అలైన్‌మెంట్ మార్చేస్తామన్న హామీని అమలు చేయాలని కోరారు. గతంలో అన్నదమ్ముళ్లు రాంకీ సంస్థతో కుమ్మక్కై దండుమల్కాపురంలో డంపు యార్డును ఏర్పాటు చేశారని ఆరోపించారు. అదేవిధంగా ట్రిపుల్ ఆర్ నిర్వాసితులు చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆస్తులు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొని ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు చిన్నం బాలరాజ్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి, బండారు నర్సింహ, గంగదేవి సైదులు, ఊడుగు మల్లేశం పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతిని కోరవద్దు

● సొంత కాళ్లపై నిలబడేందుకు కృషి చేయాలి ● ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికపాటి నర్సింహారావు


ప్రవచిస్తున్న గరికపాటి నర్సింహారావు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 18: యువత, విద్యార్థులు ప్రభుత్వాల నుంచి నిరుద్యోగ భృతిని కోరవద్దని, సొంత కాళ్లపై నిలబడేందుకు కృషి చేయాలని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ గరికపాటి నర్సింహారావు అన్నారు. భువనగిరిలోని ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ, పీజీ కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా బుధవారం యువతకు సన్మార్గ దర్శనం అంశంపై ఆయన మాట్లాడారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, కళాశాలలో లెక్చరర్లు, ఆచార్యులు అందరికీ ఒకే తీరుగా పాఠ్యాంశాలను బోధిస్తారు కానీ, కొంత మంది మాత్రమే ఉత్తమ పరీక్షా ఫలితాలు, ఉన్నత విద్యకు వెళ్లగలుగుతారని ఇందుకు ఆ విద్యార్థులు చదువుపై చూపే శ్రద్ధే ప్రధాన కారణమన్నారు. అనాదిగా మానవాళిపై పెత్తనం చేస్తున్న డబ్బు, అధికారంపై వ్యక్తిత్వం విజయం సాధించాలంటే విద్యార్థులే ప్రధాన వనరులు కావాలన్నారు. పాశ్చాత్య సుఖం భౌతికమని, భారతీయ సంస్కృతే మానవుల జీవితాలకు ఆదర్శనీయమన్నారు. ప్రపంచం అభివృద్ధి వైపు వేగంగా పయనిస్తున్నప్పటికీ అదే సమయంలో మూఢ విశ్వాసాలు కూడా విజృంభిస్తున్నాయని, జ్యోతిష్యం పేరిట మోసాలు పెరుగుతున్నాయన్నారు. పేద ప్రజలకు సేవలు చేయడమే అందరి లక్ష్యంగా ఉండాలన్నారు. అవినీతి నిర్మూలకు అందరూ కట్టుబడి ఉండాలన్నారు. చర్చల్లో చూపే శ్రద్ధను ఆచరణలో కూడా చూపితే సమాజానికి సమస్యలే ఉండవన్నారు. ఎవరి మనసును వారు పరిశీలించుకోగలిగితే దైవ సాక్షాత్కారం జరుగుతుందన్నారు. విద్యార్థులతోపాటు అందరూ ఈర్ష్య, నిరుత్సాహం, అసంతృప్తి, అసహనం, సందేహాలు, వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల కంటే అధికంగా ప్రేమించే వారెవ్వరూ ఉండరని, ఈ విషయాన్ని పెళ్లికాని అమ్మాయిలు గుర్తించాలని, ప్రేమ పేరిట మోసపోవద్దని సూచించారు. భగవద్గీతను ఆచరిస్తే జీవితమంతా సన్మార్గంలో సాగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల పాలక వర్గం అధ్యక్షుడు వనం వీరేందర్, కార్యదర్శి డాక్టర్ టీఎస్ వంశీ తిలక్, వైస్ చైర్మన్ అనిల్ స్వరూప్ మిత్ర, కోశాధికారి ఆనంద్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గంజి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతుకు తీవ్రగాయాలు

● లైన్‌మన్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు సైదులు, సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

మోతె, సెప్టెంబరు 18: తన పొలానికి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ పోవటంతో సరిచేసేందుకు స్తంభం ఎక్కిన ఓ రైతుకు విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని రావిపహాడ్‌లో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోడి సైదులు వ్యవసాయ బావి విద్యుత్ సరఫరా కాకపోవడంతో, అందుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ పోయినట్లు గమనించాడు. రావిపహాడ్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న అసిస్టెంట్ లైన్‌మెన్ ప్రసాద్‌కు ఫోన్ చేసి ఎల్‌సీ ఇవ్వాలని కోరాడు. అప్పటికే మరో రైతుకు ఎల్‌సీ ఇవ్వగా, ఆ రైతు పని ముగియగానే ఎల్‌సీ తొలగించారు. అదే సమయంలో కోడి సైదులు లైన్‌మన్‌ను ఎల్‌సీ ఇవ్వమనడంతో, ఎల్‌సీ ఇచ్చానని ప్రసాద్ చెప్పాడు. దీంతో రైతు కోడి సైదులు స్తంభం ఎక్కే ప్రయత్నం చేస్తుండగా.., మధ్యకు చేరుకోగానే విద్యుదాఘాతంతో కింద పడిపోయాడు. ఈ ఘటనలో గాయపడిన సైదులును గ్రామస్థులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కుడి చేయి కొంత భాగం కాలిపోగా, ఉదరం లోపలి భాగంలో గాయాలయ్యాయి. అసిస్టెంట్ లైన్‌మన్ ప్రసాద్ ఎల్‌సీ ఇవ్వకున్నా ఇచ్చానని చెప్పడంతోనే ఈ ప్రమాదం జరిగిందని, తక్షణమే అతనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు సబ్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టి గేట్లకు తాళం వేశారు. ఈ విషయమై నిర్లక్ష్యంగా వ్యవహరించి రైతు ప్రాణాల మీదకు తెచ్చిన లైన్‌మన్, సిబ్బందిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు సైదులు కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్య ఖర్చులు భరిస్తానని అసిస్టెంట్ లైన్‌మన్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ ఘటనపై ఘటనపై అసిస్టెంట్ లైన్‌మన్ ప్రసాద్‌ను వివరణ కోరగా.. తాను ఎల్‌సీ ఇచ్చానని, రైతు కోడి సైదులు స్తంభం ఎక్కుతుండగా, ఎర్త్ వచ్చి కిందపడ్డాడని తెలిపారు.

కొండమల్లేపల్లిలో ఫ్లెక్సీల గొడవ


ఇరువర్గాలను సముదాయిస్తున్న పోలీసులు

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 18: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మాజీ ఎంపీపీ దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి పుట్టినరోజు గురువారం జరగనున్న సందర్భంగా స్థానిక చౌరస్తాలో ఆమె అభిమానులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే మండలంలోని చిన్నఅడిశర్లపల్లి మాజీ సర్పంచ్(కాంగ్రెస్)తో పాటు కొంత మంది ఫ్లెక్సీలో తమ ఫొటోలు లేవని స్థానిక సాగర్ రోడ్డు నుంచి డివైడర్ మధ్యలో స్తంభాలకు కట్టిన ఫ్లెక్సీలను చింపివేయడంతోపాటు చౌరస్తాలోని ఫ్లెక్సీని కూడా చింపివేశారు. దీంతో ఆగ్రహించిన మాజీ ఎంపీపీ వర్గీయులు ఫ్లెక్సీ చించివేసిన వారి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామ్మూర్తి అక్కడికి చేరుకొని ఇరు వర్గాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డిని సంప్రదించగా.. ఫ్లెక్సీ వివాదంతో పార్టీకి సంబంధం లేదని, ఏదేమైనా ఫ్లెక్సీ చించివేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు.

పేరేపల్లిలో బీఆర్ఎస్ జెండా దిమ్మె ధ్వంసం


ధ్వంసమైన జెండా దిమ్మె

చిట్యాలరూరల్, సెప్టెంబరు 18: బీఆర్ఎస్ జెండా దిమ్మెను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటన చిట్యాల మండలం పేరేపల్లిలో సోమవారం రాత్రి జరిగింది. ఘటనపై చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నాయకులు ఫిర్యాదుచేశారు. గ్రామంలో బీఆర్ఎస్‌కు సంబంధించిన జెండా దిమ్మె ఉండగా, దాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మంగళవారం గమనించిన స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ కార్మిక విభాగం మండల అధ్యక్షుడు కొలను సతీష్‌గౌడ్ చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ విషయంపై ఎస్ఐ ఎన్.ధర్మను సంప్రదించగా విచారణ చేస్తున్నామని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

● హోటల్ నిర్వహణలో నష్టాలు రావడంతో మనస్తాపం

నల్లగొండ క్రైం, సెప్టెంబరు 18: ఆర్థిక ఇబ్బందులతోపాటు తాను చేస్తున్న వ్యాపారంలో నష్టం రావడంతో మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లాకేంద్రంలోని భగత్ నగర్‌కు చెందిన నిజాంపట్నం ప్రవీణ్‌కుమార్ (34) అతని భార్య సౌమ్యతో కలిసి నల్లగొండలోని పద్మానగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ప్రవీణ్ భార్య సౌమ్య జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో జూనియర్ డాక్టర్‌గా పనిచేస్తున్నారు. ప్రవీణ్ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులోని వివేకానంద విగ్రహం సమీపంలో గత కొద్ది నెలల క్రితం ఓ రెస్టారెంట్‌ను నెలకొల్పి నడిపిస్తున్నాడు. రెస్టారెంట్‌లో నష్టాలు రావడంతోపాటు రోజు రోజుకు అప్పుల వాళ్ల ఒత్తిడి పెరుగుతూ వచ్చింది. తీవ్ర మనస్తాపానికి గురైన ప్రవీణ్ కుమార్ ఈ నెల 12వ తేదీన హోటల్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన సిబ్బంది వెంటనే నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స అందించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారంమృతి చెందాడు. ప్రవీణ్ కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రాజాపేట: మనస్తాపంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం బూరుగుపల్లిలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.. రాజాపేట మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన గంప నర్సింహులు (48) కూలీ పని నిర్వహిస్తున్నారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎనిమిదేళ్ల క్రితం భార్య అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి ఆయన మద్యానికి అలవాటై మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ మానసికంగా మనస్థాపానికి గురై బుధవారం రాత్రి తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నర్సింహులు కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించినట్లు ఎస్ఐ ఉపేందర్ యాదవ్ తెలిపారు.

దాడి కేసులో మూడేళ్ల జైలు

అడ్డగూడూరు, సెప్టెంబరు 18: కర్రతో కొట్టి గాయపరిచిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ రామన్నపేట కోర్టు జడ్జి బుధవారం తీర్పు ఇచ్చారు. అడ్డగూడూరు ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. యాద్రాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం, కొండంపేట గ్రామానికి చెందిన ఇటికాల వెంకన్న తన వదిన కుమారుడైన గణేష్‌ను మద్యం మత్తులో కర్రతో కొట్టి తీవ్రంగా గాయపరచగా, గణేష్ తాత ఎర్ర లింగయ్య ఇచ్చిన ఫిర్యాదుతో అడ్డగూడూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బుధవారం రామన్నపేట కోర్టులో ఈ కేసు తుది విచారణలో భాగంగా సాక్ష్యాధారాలు పరిశీలించిన రామన్నపేట జడ్జి చందన వెంకన్నకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమనా విధిస్తూ తీర్పు వెలువరించారని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

42 రోజుల్లో రూ.2.98కోట్ల హుండీ ఆదాయం

● యాదగిరీశుడి హుండీ కానుకల లెక్కింపు



నిత్యకల్యాణంలో భాగంగా తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 18: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఖజానాకు భక్తుల నుంచి 42 రోజుల్లో రూ.2.98కోట్ల హుండీ ఆదాయం సమకూరింది. ఆగస్టు 7నుంచి ఈ నెల 17వ తేదీవరకు యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్న భక్తులు హుండీల్లో సమర్పించిన మొక్కు కానుకలను ఆలయ అధికారులు, సిబ్బంది లెక్కించారు. బుధవారం కొండకింద సత్యదేవుని వ్రత మండపంలో ఆలయ ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి పర్యవేక్షణలో నగదుతోపాటు భక్తులు సమర్పించిన బంగారు, వెండి కానుకలు లెక్కించారు. రూ.2,98,48,233 నగదు, 205గ్రాముల మిశ్రమ బంగారం, 5.710 కిలోల వెండి, 1,261 అమెరికా డాలర్లు, 125 ఆస్ట్రేలియా డాలర్లు, 65 ఇంగ్లాండ్ పౌండ్లు, 210 యూఏఈ దిరమ్స్, 730 నేపాల్ రూపీస్, 537 సౌదీ అరేబియా రియల్, 60 సింగపూర్ డాలర్లు, 3 ఖతర్ రియల్, 100 ఒమన్ బైస, 1,000 శ్రీలంక రూపీస్, 60 కెనడా డాలర్లు, 125 యూరప్ యూరోస్, 20 థాయిలాండ్ భట్, 50 రష్యా రూబెల్, ఒక రియల్ ఒమన్, 22మలేసియా రిగ్గింట్లు హుండీలో కానుకల రూపంలో సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, జూన్ 27 నుంచి ఆగస్టు 6వ తేదీవరకు 41రోజుల్లో ఆలయ ఖజానాకు రూ. 2,66,68,787 ఆదాయం సమకూరింది.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామి అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చనలు చేశారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం చేశారు. అనంతరం గజవాహనసేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణపర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన అర్చకులు అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు చేశారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల నుంచి రూ.13,48,904 ఆలయ ఖజానాకు ఆదాయం సమకూరింది.

రాహుల్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికావు

● నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు


ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హాలియా, సెప్టెంబరు 16: కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు సరికావని, ఇది బీజేపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ విమర్శించారు. బుధవారం హాలియా ప్రధాన సెంటర్‌లో మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ అగ్రనాయకులు తమ స్థాయిని మరిచి రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌని రాజారమేష్ యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, కమతం జగదీశ్వర్‌రెడ్డి, అంకతి సత్యం, నందికొండ రామేశ్వరి, వెంపటి శ్రీనివాస్, ప్రసాద్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, చెరుపల్లి ముత్యాలు, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నీళ్ల కోసం రైతుల గస్తీ


కాల్వ వెంట నిద్రిస్తున్న రైతులు

మాడ్గులపల్లి, సెప్టెంబరు 18: నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని రైతులు నీళ్ల కోసం రాత్రి వేళల్లో గస్తీ కాస్తూ నానా ఇబ్బందులు పడుతున్నారు. సాగర్ జలాశయం నుంచి వరదకాల్వకు నీటి విడుదల చేసినా పూర్తిస్థాయిలో నీరు రాకపోవడంతో రాత్రివేళల్లో రైతులు కాల్వల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. మాడ్గులపల్లి మండలం అభంగాపురం, బుగ్గబావిగూడెం, కుక్కడం గ్రామాలకు చెందిన పలువురు రైతులు వరద కాల్వ నీటికోసం రాత్రి వేళల్లో డిస్ట్రిబ్యూటరీ కాల్వల వద్ద పడిగాపులు కాస్తూ పొలాలకు నీటిని పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు ఎక్కువ నీటిని విడుదల చేసి చివరి రైతులకు నీరందే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

మూడు రోజుల్లో నాలుగో పంపు ద్వారా నీటి విడుదల

నల్లగొండ, సెప్టెంబరు 18: రానున్న మూడు రోజులలో ఎస్ఎల్‌బీసీ హై లెవెల్ కెనాల్ 4వ పంపు ద్వారా సాగు నీటిని విడుదల చేయనున్నట్లు చీఫ్ ఇంజనీర్ వి.అజయ్‌కుమార్ తెలిపారు. దీంతో ప్రాజెక్టు కాలువలకు నీరు సమృద్ధిగా వస్తుందని, అందువల్ల రైతులెవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. ముందుగా ప్రాజెక్టు కింది ఆయకట్టుదారులకు సాగు నీటిని విడుదల చేస్తామని, తర్వాత చెరువులన్నింటినీ నింపుతామని స్పష్టం చేశారు.

వివాహేతర సంబంధం అనుమానంతోనే హత్య

● డి.కొత్తపల్లి హత్య కేసును ఛేదించిన పోలీసులు ● హత్యకు పాల్పడిన ఆరుగురు నిందితుల అరెస్ట్ ● సూర్యాపేట జిల్లా నాగారం మండలంలో ఘటన


వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ రవి

సూర్యాపేటక్రైం, సెప్టెంబరు 18: తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానంతో యువకుడిని హత్యచేశాడు. ఈ ఘటన ఈ నెల 10వ తేదీన నాగారం మండలం డి.కొత్తపల్లి వద్ద జరిగింది. కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం సూర్యాపేట డీఎస్పీ జి. రవి జిల్లాకేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో వెల్లడించారు. తిరుమలగిరి పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో నివాసం ఉంటూ చేపల వ్యాపారం చేసే ఫత్తేపురం విజయ్‌కి ఆరేళ్ల క్రితం జనగాం జిల్లా దేవరుప్పల మండలం గొల్లేపల్లికి చెందిన తన మేనమామ కుమార్తె సుమలతతో వివాహమైంది. వారికి ఓ కుమార్తె జన్మించింది. విజయ్ ఇటీవల ఓ భూతగాదా విషయంలో కేసు నమోదై జైలుకు వెళ్లివచ్చాడు. తర్వాత కొన్ని రోజులకు సుమలత తండ్రి మరణించడంతో అంత్యక్రియలకు వెళ్లే సమయంలో భార్య సుమలత ఇంట్లో ఉన్న తన బంగారు ఆభరణాలు, విద్యార్హత సర్టిఫికెట్లు, భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాలు వెంట తీసుకుని వెళ్లింది. తర్వాత తిరిగి తిరుమలగిరికి రాలేదు. ఈ విషయమై విజయ్ తన భార్యను ప్రశ్నించగా తాను కాపురం చేయడానికి రానని, కాపురం చేయడం ఇష్టంలేదని తెలిపింది. గతంలో విజయ్ తల్లిదండ్రులు పలుమార్లు సుమలత ప్రవర్తన సరిగా లేదని తెలిపారు. దీంతో విజయ్‌కు తన భార్యపై అనుమానం పెరిగింది. తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న అనుమానంతో తిరుమలగిరి పట్టణం అంబేద్కర్‌నగర్‌కు చెందిన కారు డ్రైవర్ వనగండ్ల కిరణ్‌కుమార్‌ను అంతమొందించాలని అనుకున్నాడు. విజయ్‌తోపాటు ఆయన తల్లిదండ్రులు యాదగిరి, ఎల్లమ్మ, తన బావ అయిన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం బొప్పారం గ్రామానికి చెందిన దుర్గం సైదులు కలిసి చర్చించుకున్నారు. దీనికి మరికొంత మంది సహకారం అవసరమని భావించి విజయ్ బావ సైదులు తమ్ముడైన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం బొప్పారం గ్రామానికి చెందిన డ్రైవర్‌గా పనిచేసే దుర్గం బాబు, నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మాదారం గ్రామానికి చెందిన వ్యవసాయం చేసే మామిడి ఎల్లయ్య, నాగారం మండలం మాచిరెడ్డిపల్లికి చెందిన డ్రైవర్‌గా పని చేసే వడ్డె పున్నం, యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం కంచనపల్లికి చెందిన టైల్స్ పనిచేసే ఎడ్ల చంద్రశేఖర్‌లను సంప్రదించి విషయాన్ని వారికి తెలిపారు. అందులో భాగంగా విజయ్ తిరుమలగిరికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి వద్ద సెల్ఫ్ డ్రైవింగ్‌తో కారును అద్దెకు తీసుకున్నాడు. అనంతరం తన ఇంట్లో ఉన్న కత్తులను కారులో భద్రపరిచాడు.

సినీ ఫక్కీలో హత్య

విజయ్ అందరినీ తిరుమలగిరికి పిలిపించి, ఎవరెవరు ఏం చేయాలో వివరించాడు. పున్నం, చంద్రశేఖర్‌లను కిరణ్‌కుమార్ ఇంటి వద్ద కాపలా ఉంచాడు. కిరణ్ బయటకు రాగానే సమాచారం ఇవ్వమని చెప్పాడు. ఈ నెల 10న వనగండ్ల కిరణ్‌కుమార్ ఇంటి బయటకు రాగానే విషయం నిందితులకు పున్నం, చంద్రశేఖర్‌లు తెలిపారు. కిరణ్‌కుమార్ బైక్‌పై తిరుమలగిరి మెయిన్ రోడ్డు వద్దకు రాగానే కారుతో కిరణ్‌కుమార్ ప్రయాణం చేస్తున్న బైక్‌ను ఢీకొట్టారు. అనంతరం విజయ్ కత్తితో కిరణ్‌కుమార్‌పై దాడి చేసి, బలవంతంగా కారులో ఎక్కించుకుని నాగారం మండలం డి.కొత్తపల్లి వద్ద ఉన్న ఎస్సారెస్పీ కాల్వ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ విజయ్ కత్తితో కిరణ్‌కుమార్ గొంతుపై తొమ్మిది నుంచి 10సార్లు బలంగా నరికాడు. దీంతో కిరణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితులంతా అక్కడినుండి పారిపోయి కేతేపల్లి మండలం బొప్పారం గ్రామంలో దాచుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు విషయం తెలుసుకున్న నాగారం, తిరుమలగిరి పోలీసులు ఈనెల 17న రాత్రి పది గంటల సమయంలో బొప్పారం వెళ్లి నేరానికి పాల్పడిన విజయ్, వడ్డె పున్నం, దుర్గం సైదులు, ఎడ్ల చంద్రశేఖర్, మామిడి ఎల్లయ్య, దుర్గం బాబును అరెస్ట్ చేశారు. వారి నుంచి కారు, నాలుగు కత్తులు, నాలుగు బైక్‌లు, ఎనిమిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఈ కేసులో సంబంధం ఉన్న విజయ్ తల్లిదండ్రులు ఎల్లమ్మ, యాదగిరి ప్రస్తుతానికి పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకోనున్నట్లు డీఎస్పీ చెప్పారు. సమావేశంలో నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, నాగారం, తిరుమలగిరి ఎస్ఐలు ఐలయ్య, సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సులే కాన్పు చేసి.. నా బిడ్డను చంపేశారు

● అసభ్యంగా దూషించారు.. వీపుపై కొట్టారు ● కాన్పు సమయంలో స్టూల్ ఎక్కి గర్భంపై తొక్కారు ● మృత శిశువు తల్లిదండ్రుల ఆవేదన

హుజూర్‌నగర్, సెప్టెంబరు 18: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నర్సులే కాన్పు చేశారని, కాన్పు సమయంలో గర్భిణిని అసభ్యంగా దూషించారని, గర్భంపై కాళ్లతో తొక్కారని మృత శిశువు తల్లిదండ్రులు ఉన్నతాధికారుల ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో శిశువు మృతి చెందిన ఘటనపై తల్లిదండ్రులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా బుధవారం ఆ ఆసుపత్రిలో డీఎంహెచ్‌ఓ కోటా చలం, డీసీహెచ్‌వో వెంకటేశ్వర్లు విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా మృత శిశువు తల్లిదండ్రులు రేణుక, నాగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం గుర్రంపోడుతండాకు చెందిన బాసిపాకుల నాగరాజు, తన భార్య రేణుకను కాన్పు నిమిత్తం ఈ నెల 15వ తేదీన హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. మొదటి కాన్పు కావడంతో రాత్రి 11గంటల వరకు సాధారణ ప్రసవం కోసం యత్నించారు. ఆ సమయంలో రేణుకను నర్సులు ఇష్టంవచ్చినట్లు తిట్టారు. వెనుక నుంచి దాడి చేశారు. కాన్పు సమయంలో గర్భిణి పొట్టపై ఒత్తేందుకు నర్సు యత్నించగా, ఎత్తు సరిపోనందున స్టూల్ పైకి ఎక్కి గర్భాన్ని కాలుతో ఒత్తారు. కాన్పు జరిగిన అనంతరం శిశువును సూర్యాపేట ఆసుపత్రికి తీసుకువెళ్లమని వైద్య సిబ్బంది తెలిపారన్నారు. శిశువును సూర్యాపేట ఏరియా ఆసుపత్రిలో చేర్చుకున్న వైద్యులు 99శాతం పాప బతకదని కొన్ని గంటల తర్వాత చెప్పారని, ఆ తర్వాత శిశువు మృతి చెందిందని చెప్పారన్నారు. కానీ, హుజూర్‌నగర్‌లోనే శిశువు మృతి చెందిందని, డ్యూటీ డాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, నర్సులే కాన్పు చేశారని, ఇంకా నొప్పులు రావాలంటూ కాలయాపన చేసి శిశువు మృతికి కారణమయ్యారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ ఘటనను వైద్యులు పక్కదారి పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

● మొదట హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో నాగరాజు, ఆయన తల్లిని విచారణ చేసిన అధికారులు, అనంతరం రేణుక గుర్రంపోడులో ఉండగా అక్కడికి వెళ్లి విచారణ చేశారు. అధికారుల వెంట ఆసుపత్రి ఇన్‌చార్జి ప్రవీణ్, కోఆర్డినేటర్ నక్కా రవిగౌడ్, డ్యూటీ డాక్టర్ సింధు, ఇతర వైద్యులు ఉన్నారు.



హుజూర్‌నగర్‌లో అధికారులకు వివరాలు వెల్లడిస్తున్న శిశువు తండ్రి నాగరాజు, కుటుంబ సభ్యులు

ఎక్కడ మృతిచెందిందో విచారణ చేస్తున్నాం



హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో శిశువు మృతిపై తల్లిదండ్రులు రేణుక, నాగరాజును విచారించామని డీఎంహెచ్‌వో కోటాచలం తెలిపారు. డ్యూటీ డాక్టర్లు, కాన్పు సమయంలో ఉన్న నర్సులను కూడా విచారణ చేశామని, సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో కూడా విచారణ చేస్తామన్నారు. శిశువు హుజూర్‌నగర్‌లో చనిపోయిందా? సూర్యాపేట ఆసుపత్రికి తరలించాక చనిపోయిందా? అనే విషయమై పరిశీలన చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. కాన్పు సమయంలో గర్భిణిని వైద్య సిబ్బంది దూషించిన విషయమై విచారణ చేస్తున్నామని, ఇటువంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

:● కోటా చలం, డీఎంహెచ్‌వో

'కార్మిక చట్టాలను ప్రభుత్వాలు కాపాడాలి'

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 18: కార్మిక చట్టాలను ప్రభుత్వాలు కాపాడాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు గంట నాగయ్య, నెమ్మాది వెంకటేశ్వర్లు, ఎల్క సోమయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా సందర్భంగా వారు మాట్లాడారు. భవన నిర్మాణ వెల్ఫేర్ స్కీములను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించొద్దన్నారు. ఢిల్లీ, హర్యానా, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కార్మికులకు పింఛన్లు ఇవ్వడంతో పాటు వారి పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందచేస్తున్నారని తెలిపారు. ఆ రాష్ట్రాల్లో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను తెలంగాణలోని కార్మికులకు అమలు చేయాలని కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని కార్మిక సంఘాల నాయకులు కోరినా పోలీసులు అనుమతించలేదు. కార్మికులు ధర్నా చేస్తుండగా ఏవో ధర్నా వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సైదులు, మల్లయ్య, లింగయ్య, జహంగీర్, మంజుల, పద్మ, నర్సిరెడ్డి, నర్సయ్య, ఉపేందర్, వేణు, వెంకన్న, గడ్డం సైదులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: కార్మిక చట్టాలు కాపాడుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎలక సోమయ్యగౌడ్ కోరారు. బుధవారం పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించడం సరికాదన్నారు. నూతన కార్మిక చట్టాలు రద్దుచేయాలన్నారు. కార్యక్రమంలో రాంబాబు, పద్మ, వీరస్వామి, శ్రీను, మల్లేశ్వరరావు,నారాయణ, శాంతయ్య, జాన్‌సైదులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి


ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటిని వదులుతున్న ఎమ్మెల్యే సామేలు

తిరుమలగిరి రూరల్, సెప్టెంబరు 18: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. బుధవారం జనగాం జిల్లా కొండకండ్ల మండలం బయ్యన్న వాగు నుంచి 96 డీబీఎం వెలిశాలకు ఎస్సారెస్పీ రెండో దశ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి మాట్లాడారు. వారబందీ ప్రకారం నీటిని విడుదల చేస్తారని, ఈ నీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదలశాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు వై.నరేష్, సుంకరి జనార్దన్, జుమ్మీలాల్, లక్ష్మయ్య, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెంపు

నేరేడుచర్ల, సెప్టెంబరు 18: ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెంపొందడంతో పాటు పంట దిగుబడి అధికంగా వస్తుందని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త డి.నరేష్ అన్నారు. బుధవారం మండలంలోని దాచారం గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం మృతిక శాస్త్రవేత్త ఎ.కిరణ్ మాట్లాడుతూ మట్టి నమూనాను పరీక్షించి తరువాత వేసే పంటకు అవసరమైనంత మోతాదులో ఎరువులు వాడుకోవాలన్నారు. సస్య రక్షణ శాస్త్రవేత్త ఆదర్శ మాట్లాడుతూ వివిధ పంటల సాగులో సమగ్ర సస్య రక్షణ విధానాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రామయ్య, పాపయ్య, వెంకటరెడ్డి, వెంకన్న, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

రెండో లెవల్‌కు అర్హత సాధించిన 'జయ' విద్యార్థులు

కోదాడ టౌన్, సెప్టెంబరు 18: జాతీయ స్థాయిలో నిర్వహించిన ఏఎంటీఐ గణిత ఒలంపియాడ్‌లో కోదాడ జయ పాఠశాలకు చెందిన 29మంది విద్యార్థులు మొదటి లెవల్లో ప్రతిభను చాటి రెండో లెవెల్‌కు అర్హత సాధించారని, ఆ కళాశాల ప్రిన్సిపాల్ జయ వేణుగోపాల్ తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్ డైరెక్టర్లు, బింగి జ్యోతి, జెల్లా, పద్మ, హెచ్‌ఎం చిలువేరు వేణు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టుల కృషి

నేరేడుచర్ల, సెప్టెంబరు 18: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టులు నిరంతరం కృషి చేస్తున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొదమగుండ్ల నగేష్ అన్నారు. బుధవారం మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలో నిర్వహించిన సీపీఎం శాఖ మహాసభలో పాల్గొని మాట్లాడారు. మూడేళ్లకు ఒకసారి సీపీఎం మహాసభలు నిర్వహించి గ్రామశాఖ కార్యదర్శి నుంచి జాతీయ కార్యదర్శి వరకు ఎన్నుకుంటార న్నారు. కేంద్రంలోని బీజేపీ తమ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రూ. 2లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు ఇవ్వాలన్నారు. అనంతరం పెంచికల్‌దిన్న గ్రామశాఖ కార్యదర్శిగా అల్వాల శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సిరికొండ శ్రీను, సీపీఎం మండల నాయకులు మర్రి నాగేశ్వరావు, నందమూరి బాబూరావు, సుంకరి వెంకటేశ్వరావు, రాణమ్మ, రాములమ్మ, భిక్షం, సైదమ్మ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వం విఫలం

హుజూర్‌నగర్, సెప్టెంబరు 18: భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీనివాసు, గుండు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పరిధిలోని ఎండిన పంట పొలాలను, గండిపడిన ప్రదేశాన్ని పరిశీలించి మాట్లాడారు. ఇసుక మేటలు వేసిన పొలాలకురూ. 50వేల పరిహారం చెల్లించాలని, వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు 20వేలు చెల్లించాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు.ఈ కార్యక్రమంలో యల్లావుల రమేష్, మామిడి నర్సయ్య, జక్కుల రమేష్, తురక అంజయ్య, రమణ పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలి

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబరు 18: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలని ఓయూ జేఏసీ, ప్రజా సంఘాల నాయకులు సోమగాని నరేందర్, బాదె నర్సయ్య, బాలాజీనాయక్ కోరారు. బుధవారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో జిల్లా వైద్యాధికారి కోటా చలంకు వినతి పత్రం ఇచ్చారు. గైనకాలజిస్టులు, సివిల్ సర్జన్, అసిస్టెంట్ సర్జన్లు జనరల్ మెడిసిన్ వంటి పోస్టులు ఖాళీగా ఉన్నందున రోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. 100 పడకల ఆసుపత్రిలో సగం పోస్టులకు పైనే ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసుపత్రిలో సిబ్బంది, నర్సుల పనితీరు సక్రమంగా లేదన్నారు. రోగులను ప్రతి విషయానికి సూర్యాపేటకు సిఫార్సు చేస్తున్నారన్నారు. కొంతమంది డాక్టర్లు రోగులను, గర్భిణులను దూషిస్తున్నారని, చేయిజేసుకుంటాన్నఏరే ఆరోపణలు ఉన్నాయన్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబరు 18: మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. బుధవారం పట్టణంలో మత్స్యకారుల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. హైదరాబాద్‌లో ఈ నెల 25న నిర్వహించే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలన్నారు. ఇబ్రహీంపట్టణంలో నిర్వహించనున్న రాష్ట్ర మత్స్యకారుల సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్, పర్వతాలు, వెంకన్న, యశోద, కృష్ణ, గురవమ్మ, జానకిరాములు పాల్గొన్నారు.

సకాలంలో సాగునీటిని అందిస్తాం


కోదాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కోదాడ టౌన్, సెప్టెంబరు 18: రైతులు అధైర్య పడొద్దని, సకాలంలో ప్రభుత్వం సాగు నీటిని అందిస్తుందని డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, పీసీసీ ప్రతినిధి చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కోదాడ పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావు అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారుఎమ్మెల్యేగా మల్లయ్యమాదవ్ పనిచేస్తున్న సమయంలో దళిత బంధు లబ్ధిదారుల నుంచి కమీషన్ తీసుకున్నారని ఆరోపించారు. భారీ వర్షాలకు పంట నష్టంపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంచనా వేయించి రైతులకు న్యాయం చేస్తారని, కాల్వలకు గండ్లు పూడ్పిస్తారని, ఆర్కే మేజర్ కాలువకు నీటిని విడుదల చేయిస్తారని తెలిపారు. ఈ సమావే శంలో మాజీ ఎంపీపీ మల్లెల రాణి, మునిసిపల్ కోఆప్షన్ మెంబర్ కందుల కోటేశ్వర రావు, మాజీ జడ్పీటీసీ కొణతం శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ కర్రి శివసుబ్బారావు, బొలిశెట్టి నాగేంద్రబాబు, నల్లూరి రవి పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి దంపతులను విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ కోదాడ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుడిబండ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో తొండపు సతీష్, నంబూరి సూర్యం, వెంకటేశ్వరరావు, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

సాగర్ కాలువ గండ్లను వెంటనే పూడ్చాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

కోదాడ టౌన్, సెప్టెంబరు 18: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సాగర్ కాలువకు పడిన గండ్లను వెంటనే పూడ్చి రైతులకు సాగు నీరు అందించాలని బీజేపీ కోదాడ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణరావు అన్నారు. బుధవారం కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిట్టయ్య అధ్యక్షతన కోదాడలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతు భరోసా వెంటనే అందించాలి, అర్హులైన రైతులందరికీ పంట రుణ మాఫీని వర్తింప జేయాలని కోరారు. ఇసుక మేట వేసి ప్రతి ఎకరాకు రూ.50వేలు, పంట నష్టం జరిగిన ప్రతి ఎకరాకు రూ.25వేలు, వ్యవసాయ బావి పూడిపోతే రూ.50వేలు, బోరుకు రూ.25 వేలు, మోటారుకు రూ.50 వేలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిరాజు యశ్వంత్, కోకన్వీనర్ బొలిశెట్టి కృష్ణయ్య, వంగవీటి శ్రీనివాసరావు, వై.రామారావు, సీహెచ్ శ్రీనివాసరావు, కృష్ణప్రసాద్, వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా జనార్దన్, జెల్లా నరసింహారావు, సైదులు, సాయికృష్ణ, పందు సాహెబ్, దాసు, శెట్టి కిరణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన నాయకులను అరెస్టు చేయాలి



తుంగతుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

తుంగతుర్తి, సెప్టెంబరు 18: రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నాయకులను వెంటనే అరెస్టు చేయాలని ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు కొండగడుపుల ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలపై బుధవారం తుంగతుర్తిలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రజల తరపున పోరాడుతున్న రాహుల్ గాంధీని, కేంద్ర మంత్రి రవ్‌నీత్‌బిట్టు, బీజేపీ ఢిల్లీ మాజీ ఎమ్మెల్యే తర్వీందర్‌సింగ్‌మార్వాపై అసభ్యక రంగా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని రాహుల్‌గాంధీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెండెం రాంమూర్తి, కొండగడుపుల ప్రవీణ్‌కుమార్, ఉమేష్, శ్రీకాంత్, సోహెల్, భరత్, ఈశ్వర్, స్వరూప్, సిద్ధు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటఅర్బన్: రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద ఢిల్లీ బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తర్వీందర్‌సింగ్ దిష్టి బొమ్మను దహనం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ కౌన్సిలర్ వేములకొండ పద్మ, నాగుల వాసు, పోలెబోయిన నర్సయ్య యాదవ్, గండూరి రమేష్, తంగెళ్ల కర్ణాకర్‌రెడ్డి, నాగునాయక్, సాజీద్, సిద్దీఖీ, మల్లెష్, అరుణకుమార్, సాయినేత పాల్గొన్నారు.

కొనసాగిన గణేష్ శోభాయాత్రలు, లడ్డూ వేలం పాటలు


పెన్‌పహాడ్ మండలం అన్నారంబ్రిడ్జి గ్రామంలో గణేష్ లడ్డును దక్కించుకున్న సయ్యద్ ఫరీద్-సోని దంపతులు

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 18: జిల్లా కేంద్రంలోని 14వార్డులో నిర్వహించిన వేలం పాటలో గణేష్ లడ్డును కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పంతంగి దశరథ దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామలింగేశ్వస్వామి దేవాలయ అర్చకుడు రెంటాల సతీష్ శర్మ, పంతంగి రేణుక, ఉత్సవ కమిటీ సభ్యులు మహేష్, మనోజ్, విక్రమ్, సంతోష్, వినోద్, లచ్చయ్య, బ్రహ్మం, డేగల శ్రీను పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని 16వ వార్డు జాకీర్‌హుస్సేన్ నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక లడ్డూను వేలం పాటలో జిల్లా కేంద్రానికి చెందిన వాసం శెట్టి వెంకటేశ్వర్లు రూ.40116 కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు షేక్ జహీర్, కొండపల్లి దిలీప్‌రెడ్డి, పరకాల ప్రవీణ్, సందీప్, సతీష్, నవీన్, నరేష్, ప్రేమ్, లేఖన, రేవంత్ పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: మండల వ్యాప్తంగా 11 రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథులను మేళతాళాలు, భజనలు, కోలాటాలతో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు

మద్దిరాల: మండల కేంద్రంతో పాటు మండలంలోని ముకుందాపురం, జి.కొత్తపల్లి గ్రామాల్లోగణేష్ శోభాయాత్రలు నిర్వహించి, అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గణేష్ లడ్డును దక్కించుకున్న ముస్లిం కుటుంబం

పెన్‌పహాడ్: మండలంలోని అన్నారంబ్రిడ్జి గ్రామంలో గణేష్ లడ్డును వేలం వేయగా, సయ్యద్ ఫరీద్-సోని దంపతులు రూ.12,500కు దక్కించుకున్నారు ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు షేక్ జానీ బేగం, సయ్యద్ ఫాతిమా, జాబిన్, నియాజ్, ఫయాజ్ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

తిరుమలగిరి రూరల్, సెప్టెంబరు 18: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకో వాలని సీడీపీవో శ్రీజ అన్నారు. పోషణ మాసోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని తొండ గ్రామంలో చిన్నారులకు అన్నప్రాశన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు సమయానికి ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మంగమ్మ, ఖైరున్నీసాబేగం, పంచాయతీ కార్యదర్శి యాకూబ్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, అశ్విని, హేమలత, ఆయాలు సోమనర్సమ్మ, సుమలత, ఆశా కార్యకర్త కలమ్మ పాల్గొన్నారు.

మఠంపల్లి: ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని మఠంపల్లి అంగన్‌వాడీ టీచర్ ఎం.వీరకుమారి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మహోత్సవ్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గోవిందమ్మ, ధానమ్మ, రాములమ్మ,కిష్టవేణి, రమణ, ఆయాలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పెంపకం చేపడతాం

నేరేడుచర్ల, సెప్టెంబరు 18: మండలంలోని పెంచికల్‌దిన్నెచెర్వులో మత్స్యకారులు సొంత ఖర్చుతో చేప పిల్లలు పోసి పెంచాలని చెరువు సొసైటీ సభ్యులు బుధవారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ కన్వీనర్ ఇంజమూరి వెంకటయ్య మాట్లాడుతూ చెరువులోని చేపలను స్థానికులు పట్టొద్దన్నారు. చెరువును లీజుకు ఇస్తే సొసైటీ అభివృద్ధిని పట్టించుకోవడంలేదని, సొసైటీ ఇప్పటికే నష్టంలో ఉందన్నారు. చెరువుల్లో చేపలను లూటీ చేసి, సొసైటీ సభ్యులపైన దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో సిరికొండ నాగయ్య, యడవెల్లి చంద్రయ్య, సిద్ధపంగ సోమయ్య, పెండెం రాములు, సిరికొండ మధు, యామగాని రాంబాబు, రాచూరి లక్ష్మయ్య, రవి, రాములు, దేవతయ్య, నాగయ్య పాల్గొన్నారు.

పెంచికల్‌దిన్నె వైద్యురాలు బదిలీ

నేరేడుచర్ల, సెప్టెంబరు 18: మండలంలోని పెంచికల్‌దిన్న వైద్యురాలిని బదిలీ చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కోటాచలం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను మేళ్లచెర్వు పీహెచ్‌సీకి బదిలీ చేయగా, ఇప్పటివరకు నేరేడుచర్లలో పనిచేస్తున్న ఇద్దరు డాక్టర్లలో రెండో డాక్టర్ సౌమ్యశ్రీని పెంచికల్‌దిన్నకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 18: గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని టీఎస్‌యూటీఎఫ్ మైనార్టీ గురుకుల విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పయ్యావుల భరత్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు గురుకులాల్లో టీఎస్ యూటీఎఫ్, జేఏసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచాలన్నారు. మహిళా టీచర్లతో రాత్రి తొమ్మిది గంటల వరకు పనిచేయించడం హేయమైన విధానమన్నారు. 36గంటలు నిరవధికంగా ఏ ప్రభుత్వ శాఖ ఉద్యోగులు పనిచేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

తుంగతుర్తి: మైనార్టీ గురుకులాల్లో పాత టైం టేబుల్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ బుధవారం భోజన విరామం సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలకు పక్కా భవనం నిర్మించాలని, విద్యార్థుల మెస్ చార్జీలను పెంచి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

తుంగతుర్తి, సెప్టెంబరు 18: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈవో బోయిని లింగయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అండర్-14, 17 ఖోఖో, వాలీబాల్ మండల స్థాయి సెలక్షన్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఉపయోగపడతాయని, పోటీల్లో పాల్గొనే ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో, క్రీడాస్ఫూర్తితో ఆడి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, క్రీడల కన్వీనర్ యాదయ్య, ఉపాధ్యాయులు అంబేద్కర్, కార్తీక్, శ్రీనివాస్, మహేష్, వంశీకృష్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ క్రిస్టియన్ల గణన చేపట్టాలి'


చివ్వెంల, సెప్టెంబరు 18: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన చేపట్టడంతో పాటు ఎస్సీ ఎస్టీ, బీసీ, ఓబీసీ క్రిస్టియన్ల గణన చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ దుర్గం ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని శాంతినగర్‌లో బెతెస్థ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో క్రైస్తవులు, ముస్లిం మతంలోకి మారిన దళితులకు ఎస్సీ హోదా కల్పించే అంశంపై అధ్యయనానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేజీ బాలకృష్ణన్ ఆధ్వర్యంలో కేంద్రం కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిషన్ ఆధారంగా క్రిస్టియన్ దళిత కులగణన చేపట్టాలన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో పాస్టర్లు సీహెచ్ శ్యాంప్రసాద్, జలగం జేమ్స్, బొక్క ఎలియరాజు, ఉట్కూరి రాజు, కొండేటి లాజర్, ఎం.రూబెన్, కిస్టోఫర్, మార్క్, కిరణ్‌కుమార్, అబ్రహం, సుధాకర్, హోసన్న పాల్గొన్నారు.

ఎండిపోతున్న పంటలను కాపాడాలి: సీపీఐ

అనంతగిరి, సెప్టెంబరు 18: సాగు నీటి కాల్వలకు గండ్లు పూడ్చి ఎండిపోతున్న పంటలను కాపాడాలని సీపీఐ మండల కార్యదర్శి బద్దం కృష్ణారెడ్డి కోరారు. బుధవార మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. వరదతో నడిగూడెం మండలం కాగిత రామచంద్రపురం సమీపంలో ఎడమ కాల్వకు 132, 233 కిలోమీటర్ల వద్ద రెండుచోట్ల గండి పడటంతో పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. 60 అడుగుల మేర గండిపడడంతో ప్రధాన కాలువకు నీటిని నిలిపివేశారు. దీంతో పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయన్నారు. ఎడమ కాల్వకు 14రోజుల క్రితం గండి పడినా, నేటికీ పనులు పూర్తిచేయలేదన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి స్పందించి గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుడు సత్తార్ మృతి బాధాకరం

మునగాల రూరల్, సెప్టెంబరు 18: మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు షేక్ సత్తార్ మృతి బాధాకరమని రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, కోదాడ బీఆర్ఎస్ నాయకుడు బెజవాడ శ్రవణ్ అన్నారు. సత్తార్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కొండపల్లి ఆంజనేయులు, కత్తి భగత్, నర్సయ్య పాల్గొన్నారు.



ఆత్మకూర్(ఎస్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్ఐ వై.సైదులు అన్నారు. మండలంలోని ఏపూరు జడ్పీహెచ్ఎస్‌లో క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ధరాసింగ్, నోడల్ అధికారి మురళీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని సీఐ చరమందరాజు, ఎస్ఐ ముత్తయ్య అన్నారు. పట్టణంలోని విజయ విద్యామందిర్ పాఠశాలలో సైబర్ నేరాలు, గంజాయి తదితర అంశాలపై కళా బృందంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.కార్యక్రమంలో ఎఎస్ఐ రమేష్, నాగరాజు, సత్యనారాయణ, రవీందర్, పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలోని ఎక్సైజ్ కాలనీలో ఈ నెల 20న వాహనాల వేలం నిర్వహించనున్నట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఈ వేలంలో పాల్గొనే వారు ముందుగా ధరావత్ చెల్లించాలన్నారు.

నేరేడుచర్ల: మండలంలోని జానల్‌దిన్నె గ్రామానికి చెందిన షేక్ మౌలానాకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, దాసరి సతీష్, చిత్రం విశ్వనాథం, రాపోలు నవీన్, నాగార్జున పాల్గొన్నారు.

● మహాలక్ష్మి పథకంలో భాగంగా సబ్సిడీకి అర్హులైన లబ్ధిదారులకు అర్హత కాపీలు అందజేసినట్లు మునిసిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ తెలిపారు. బుధవారం నేరేడుచర్లలో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ యడవెల్లి అశోక్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ అలక సరిత, కౌన్సిలర్లు కొణతం చినవెంకటరెడ్డి, రణపంగ నాగయ్య, బాష, సాయిరాం, సరిత, లలిత, నాగవేణి, ఆర్పీలు పాల్గొన్నారు.

నేరేడుచర్ల, మఠంపల్లి: మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామానికి చెందిన పలువురికి రూ.1.53లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొణతం చినవెంకటరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీరమాచినేని కృష్ణయ్య, వల్లంశెట్ల కృష్ణయ్య, ఊట్కూరి భార్గవ సైదులు, పెరుగు నాగరాజు, సిద్ధపంగ రామకృష్ణ, సిరికొండ రామకృష్ణ, నాగయ్యపాల్గొన్నారు.

● మఠంపల్లి మండలంలో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు బాష్యం వీరబాబు అందజేశారు.

మఠంపల్లి: ముసాయిదా ఓటర్ల జాబితాపై మండల పరిషత్ కార్యాల యంలో గురువారం వార్డుల వారీగా రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బానాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అధ్యక్షులు, కార్యదర్శులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

● మఠంపల్లి మండలంలోని పెదవీడు రెవెన్యూలోని గుర్రంబోడు సర్వే నెం.540లో గిరిజన రైతులకు ప్రభుత్వపరంగా న్యాయం జరిగే వరకూ సీపీఎం అండగా ఉంటుందని ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండునాయక్ అన్నారు. బాధిత రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మాలోతుబాలునాయక్, వినోద్, రాము, చందు, జగన్, మంగ్యానాయక్ పాల్గొన్నారు.

● మఠంపల్లి మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల, మునగాల రూరల్: 'స్వచ్ఛతా హీ సేవ' సేవ-2024లో భాగంగా నేరేడుచర్ల మునిసిపాలిటీలో స్వచ్ఛత ప్రతిజ్ఞను బుధవారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, వైస్ చైర్‌పర్సన్ అలక సరిత, కమిషనర్ యడవెల్లి అశోక్‌రెడ్డి, కౌన్సిలర్లు కొణతం చినవెంకటరెడ్డి, నాగయ్య, తాళ్లూరి సాయి, కొదమగుండ్ల సరిత, బాణోతు లలిత, బాషా, వేమూరి నాగవేణి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● మునగాల మండలంలోని జగన్నాథపురం ప్రాథమికోన్నత పాఠశాలలో పరిశుభ్రం చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి హెచ్‌ఎం ఒక్కంతుల భరత్‌బాబు, గ్రామ కార్యదర్శి నర్రా అనిత, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: ఓటర్ జాబితాపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అన్ని రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాంచంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీల మండల స్థాయి అధ్యక్షులు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు.

అనంతగిరి: మండలంలోని కిష్టాపురం గ్రామంలో వరదల్లో మునిగిన 95కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 20కిలోల బియ్యం చొప్పున గ్రామానికి చెందిన తూమాటి శ్రీనివాసరెడ్డి రేణుక దంపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తన తల్లి స్వరాజ్యం జ్ఞాపకార్థం గ్ర బియ్యం పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కత్రం జ్ఞానేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సత్యవతి నాగేశ్వరరావు, లక్మల జానమ్మ వెంకటప్పయ్య, కరిశ సత్యావతి మోజేష్, బుడిగ సురేష్ పాల్గొన్నారు.

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లి గ్రామంలో బుధవారం అన్ని చెరువుల్లో మత్స్య సొసైటీ ఆధ్వర్యంలో ఐదు లక్షల చేప పిల్లలను పోశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అంకిరెడ్డి లింగయ్య, అంకిరెడ్డి సుదర్శన్, రాములు పాల్గొన్నారు.